క్లుప్తంగా

హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ



చికిత్స పొందుతున్న బాధితురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ పరశయ్య

బలిజిపేట: పార్వతీపురం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారుకు సుమతికి బలిజిపేట మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన వలంటీర్ ఎ.పరశయ్య శుక్రవారం పింఛన్ అందజేశాడు. పదిరోజులనుంచి ఆమె తలసేమియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించడంపై బంధువులు, గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

పణుకుపేటలో సీసీరోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవమైన పణుకుపేట గ్రామానికి ప్రభుత్వం యూనానిమస్ గ్రాంట్ విడుదల చేయడంతో అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ బి. పద్మావతి, సచివాలయ కన్వీనరు శ్రీహరినాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పణుకుపేట గ్రామం నుంచి బీసీ కాలనీకి వెళ్తున్న మట్టి గోర్జను సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించారు. అలాగే గ్రామంలో రూ.15 లక్షలతో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణం జరుగుతోందని తెలియజేశారు. నిర్దేశించిన గడువులోగా ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, ఉపసర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో సీఆర్‌ఎంటీలు



తోటవలస పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న సీఆర్‌ఎంటీ మురళీకృష్ణ

మక్కువ: సమగ్రశిక్ష అభియాన్‌లో సుమారు 11 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీ (క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లను ప్రభుత్వం ఇటీవల సీఆర్‌ఎంటీ (క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్)లుగా మార్పు చేసిన విషయం తెలిసిందే. సీఆర్‌ఎంటీలు క్లస్టర్ పాఠశాలల మానటరింగ్ చేయడంతో పాటు ఏకోపాధ్యాయుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవు పెడితే విద్యాబోధన చేస్తున్నారు. తోటవలస గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడు శుక్రవారం సెలవు పెట్టడంతో సీఆర్‌ఎంటీ మురళీకృష్ణ విద్యార్థులకు పాఠ్యాంశాలును బోధించారు.

నేడు మండలసమావేశం

సీతానగరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.రమణమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ తెలియజేశారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ ఛైర్మన్‌లు పాల్గొనే సమావేశానికి వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు శాఖల వారీగా ప్రగతి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో హాజరు కావాలని కోరారు.

45 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ట్రాఫిక్ ఎస్సై పాపారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో శుక్రవారం 45 మద్యం సీసాలతో నిందితుడిని అరెస్టు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై పాపారావు తెలిపారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పార్వతీపురం నుంచి కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి వెళ్తున్న వారణాశి చిరంజీవి గ్రామంలో మద్యం అమ్మకాల నిమిత్తం 45 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుడి నుంచి మద్యం సీసాలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

తురాయిపువలసలో ఫాగింగ్

సీతంపేట: మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వ్యాపిస్తుండడంతో స్థానికంగా ఉన్న తురాయిపువలస వీధిలో గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. గ్రామ కార్యదర్శి సుదర్శనరావు పర్యవేక్షణలో సిబ్బంది ఫాగింగ్ చేశారు.

హామీల అమలే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు.

సీతానగరం:

రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం సేవలందిస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని తామరఖండి పంచాయతీలో దశాబ్దాల కాలంగా రహదారి సౌకర్యంలేక ప్రజలు అవస్థలు పడుతున్న దృష్ట్యా రేపటివలస గ్రామానికి వేస్తున్న బీటీరోడ్డు పనులను శుక్రవారం ఆయన నియోజకవర్గ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలోని గ్రామాలకు అను సంధానంగా ఉన్న మట్టిగోర్జలు, మెటల్‌రోడ్లను బీటీరోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయిలు మంజూరుచేసిందని చెప్పారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు కాంట్రాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోగా బీటీరోడ్డు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్‌లు, సచివాలయ కన్వీనర్లు, అధికారులు పాల్గొన్నారు.



బీటీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- ఎంపీపీ పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మక్కువ: ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేకుండా చూడాలని ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు శాఖాపరమైన ప్రగతి వివరించారు. నాడు - నేడు నిధులతో పాఠశాల నిర్మాణ పనులు జరుపుతున్నట్లు ఎంఈఓ సత్యానారాయణ తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచినట్లు ఏఓ శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న బంగారువలస, డి.శిర్లాం గ్రామాల రహదారుల పనులు కొన్ని కారణాల వల్ల నిలిచాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పీఆర్ డీఈ శర్మ తెలిపారు. అలాగే కోట్లాది రూపాయలతో నిర్మించిన రహదారులపై ట్రాక్టర్లు వీల్స్‌తో రాకపోకలు సాగించడం వల్ల పాడవుతున్నాయని, ఈ విషయంలో పోలీసులు, పీఆర్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. అనంతరం పంచాయతీ సర్పంచ్‌లకు ఫాగింగ్ మెషీన్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

పొదుపు సంఘాల ఆర్థిక బలోపేతానికి కృషి

పార్వతీపురంటౌన్: పొదుపు సంఘాల మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని వెలుగు ఏపీడీ వై సత్యం నాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని ఆడారు గ్రామంలో గిరిక్రాంతి వీడీవీకేకి చెందిన 35 మంది సభ్యులకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 మంది శిక్షకులకు వ్యక్తిగత యూనిఫాంతో పాటు శిక్షణ సామగ్రిని అందజేశామన్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఎస్‌బీఐ సహకారంతో ఈ శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. కావున శిక్షకులు అందరూ తప్ప కుండా 10 రోజుల పాటు శిక్షణ పొంది నిష్ణాతులు కావాలని సూచించారు. తద్వారా అగర్‌బత్తీల పరిశ్రమను విజయవంతంగా నడిపేందుకు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ జీబీవీ రమణ, కో ఆర్డి నేటర్‌గా వర్మ, డీపీఎం ఎస్‌హెచ్‌పీ ప్రవీణ్‌కుమార్, ఏపీఎం సురేష్ , ఎల్‌హెచ్ ఏపీఎం జయ కుమార్, సీసీలు నాయక్, చిన్నారావు వీఓఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ సత్యం నాయుడు

లార్వా నివారణ చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: లార్వా నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ఎన్జీఓ సమావేశ భవనంలో జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల హెల్త్ సూపర్‌వైజర్స్‌కు ఆరోగ్య కార్యక్రమాలపై శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా దోమలు పునరుత్పత్తి చెందే స్థావరాలను గుర్తించి యాంటీ లార్వా టీమోఫాస్ పిచికారీ చేయించాలని, ఇంటిలో ఏసీఎం 5% పిచికారీ చేయించాలని, ఫీవర్ సర్వే పూర్తి స్థాయిలో చేసి జ్వర లక్షణాలు గుర్తిస్తే వెంటనే మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేసి తగిన చికిత్స ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటికే అన్ని ఆరోగ్య కేంద్రాలకు టెస్ట్ కిట్స్ పంపిణీ చేశామన్నారు. డ్రై డే కార్యక్రమాలు పక్కాగా జరపాలని, సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వసతి గృహాలను తరచుగా సందర్శించి, సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థుల చికిత్స, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎ.శ్యామ్ కుమార్, ఏపీడీమాలలజిస్టు డాక్టర్ ఎం.నవీన్ కుమార్, జిల్లా మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర, ఏఎంఓ సూర్యనారాయణ, డెమో సన్యాసిరావు, ఎస్ఓ శంకర్ పాల్గొన్నారు.

తడిపొడి చెత్తనుంచి సంపద తయారీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్

సీతానగరం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు గ్రీన్‌అంబాసిడర్లు సేకరిస్తున్న తడిపొడి చెత్తనుంచి సంపద తయారు చేయడానికి పంచాయతీ పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా అంటిపేట సచివాలయంలో సర్పంచ్ బి.తిరుపతిరావు అధ్యక్షతన వలంటీర్లు, గ్రీన్‌అంబాసిడర్లతో చెత్తనుంచి సంపద తయారు చేయడం, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, దోమల నివారణకు తీసు కోవలసిన జాగ్రత్తలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని తెలియజేశారు. వీధుల్లో, ఇళ్లలో చెత్తను బయట వేయకుండా పంచాయతీ పాలకులు పంపిణీ చేసిన చెత్తబుట్టల్లో వేసి ఉదయాన్నే ఇంటికి వస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని సూచించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో గ్రీన్‌అంబాసిడర్లకు గ్లౌజులు, సేకరణకు అవసరమైన పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు మేలు..



మార్కొండపుట్టిలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఐసిడీఎస్ సిబ్బంది

మక్కువ: ఆరు నెలలు వరకు బిడ్డలకు తల్లిపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎన్.లీలావతి, పి,రాజశ్రీ తెలిపారు. మండలంలోని మార్కొండపుట్టి అంగన్‌వాడీ-1 కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. దీనివలన పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వరిలో జింక్‌లోపం నివారించాలి



వరియదలో జింక్ లోపాన్ని పరిశీలిస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: వరి యద రూపంలో మండలంలో సాగు చేస్తున్న భూముల్లో జింక్‌లోపం ఉన్నట్లు గుర్తించిన ఏఓ ఎస్ అవినాష్ రైతులకు పలుసూచలు చేసారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఇప్పలవలస, పాపమ్మవలస గ్రామాల్లో వరియద వరిచేను పంటలను, అంటిపేట గ్రామంలో తాడు ఉడుపుచేసిన పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పలవలసలో ఎంపీటీసీ సాగు చేస్తున్న వరియద పొలంలో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించారు. వరిచేనులో జింక్‌లోపాన్ని నివారించడానికి ఎకరాకు 110 గ్రాముల ఫోలియర్ జింక్ పిచికారీ చేయాలని జింక్ చిలామిన్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో సలహాసంఘం చైర్మన్ పి.ఈశ్వరనారాయణ, ఎంపీటీసీ జి సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్వామా పీడీ సుడిగాలి పర్యటన



సాలూరు టిడ్కో ఇళ్ల వద్ద ప్లాంటేషన్‌పై అధికారులను ఆదేశిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

సాలూరు: సాలూరు, పాచిపెంట మండలాల్లో డ్వామా పీడీ రామచంద్రరావు శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. సాలూరు మండలంలో అన్నంరాజువలస గ్రామంలో.. పాచిపెంట మండలంలో పి.కోనవలస గ్రామంలో జీడి మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. అనంతరం సాలూరు మండల పరిషత్ కార్యాయంలో మండలంలో ప్లాంటేషన్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. టార్గెట్ ప్రకారం ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓలు, ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ఒకరి మృతి



పొలంలో బోల్తా పడిన ట్రాక్టర్

సీతంపేట: వరి ఉభాలు చేయడానికి దుక్కిదున్నుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో రూపాయి గ్రామానికి చెందిన ఆరిక భాస్కరరావు (57) శుక్రవారం అక్కడికక్కడే మృతిచెందాడు. ఎప్పటిలాగానే పొలం దున్నడానికి భాస్కర రావు వెళ్లగా పొలంలో ఉన్న గోతిలో ట్రాక్టర్ కూరుకుపోయింది. దానిని తీయడానికి ఎంత ప్రయత్నించినా రాకపోగా ఊహించని రీతిలో బోల్తాపడింది. ఒక్క ఉదుటన డ్రైవర్‌పై ట్రాక్టర్ పడిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బురదలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు వెలికితీశారు. మృతునికి భార్య భద్రమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతివార్త విన్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు, బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. అయితే ఈ విషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని దోనుబాయి పోలీసులు తెలిపారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రైతులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తనాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. షెడ్యూల్ కులాల సహకార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బందలుప్పి గ్రామంలో విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు ప్రభుత్వం విత్తనాలను అందజేస్తుందన్నారు. పీఎం ఏజేఏవై కింద నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేశామని తెలిపారు.

త్వరలో వ్యవసాయ ఉపకరణాల పంపిణీ

ఎస్సీ వర్గాల అభివృద్ధికి కార్పొరేషన్ ద్వారా ఒక్కో ఎస్సీ రైతుకు రూ.7,630 విలువ గల ఇతర వ్యవసాయ ఉపకరణాలు, ఫెరామిన్ ట్రాప్స్ లూర్స్, ఎల్లోస్టిక్స్ ప్లేట్స్, టార్పాలిన్స్, డ్రమ్ములు మొదలైనవి త్వరలో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు, కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే ప్రధాన భూమిక

బలిజిపేట: వివిధ పాఠశాలల్లో ఫేజ్-2నాడు-నేడు పనుల నిర్వహణలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే ప్రధాన భూమిక అని ఎంఈఓ సామల సింహాచలం స్పష్టం చేశారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22పాఠశాలల్లో పది కాంపొనెంట్ పనులు నిర్వహిస్తున్నారని వాటిని త్వరితగతిన పూర్తిచేయించాలని కోరారు. ఆయా పాఠశాలలను పర్యవేక్షించి, ప్రధానోపాధ్యాయులను సంప్రదించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా బాధ్యతలు తీసుకోవాలని కోరారు. పూర్తిచేసిన పనులను వెంటనే ఫొటో క్యాప్చరింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సామల

ఏపీఓ సురేష్‌కు ఘనంగా సన్మానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహించి బదిలీ అయిన ఎ.సురేష్‌కుమార్‌కు శుక్రవారం గిరిమిత్ర సమావేశమందిరంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌తోపాటు సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ చేసిన చేసిన సేవలను పీఓ ప్రశంసించారు. అంకితభావంతో పని చేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, తిరుపతిరావు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

నూతన ఏపీఓగా మురళీధర్

పార్వతీపురం ఐటీడీఏలో ఏపీఓగా విధులను నిర్వర్తించిన ఎ.సురేష్‌కుమార్‌కు శ్రీశైలం ఐటీడీఏకు బదిలీ కాగా శ్రీశైలం ఐటీడీఏలో ఏపీఓగా పనిచేసిన మురళీధర్ పార్వతీపురం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మురళీధర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ సిబ్బందిని సమన్వయం చేసుకుని గిరిజనులకు న్యాయం చేస్తానని ఆయన చెప్పారు.



సురేష్‌కుమార్‌కు సన్మానిస్తున్న పీఓ విష్ణుచరణ్ తదితరులు

పెదపెంకి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా నీరు విడుదల



పెదపెంకి వద్ద నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలం మీదుగా వెళ్తున్న తోటపల్లి కుడికాలువ నుంచి పెదపెంకి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం విడుదల చేశారు. సుమారు 450మీటర్ల మైనర్ కాలువ పనులను కొద్ది రోజుల క్రితం ప్రారంభించి పూర్తిచేయించి నీరు విడుదల చేయడంతో రైతులు సంతృప్తి చెందుతున్నారని ఎమ్మెల్యే జోగారావు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపారావు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, తోటపల్లి ప్రాజెక్టు అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ

పార్వతీపురంటౌన్: భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విజయవాడ జోనల్ తమ 39వ శాఖను పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ప్రజల అవరాల మేరకు బ్యాంకు తమ సేవలను మెరుగ్గా అందిస్తుందని తద్వారా జిల్లా పురోగతిలో భాగంగా ఉంటామని హామీ ఇచ్చారు. బ్రాంచ్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ తమ నూతన శాఖ ముందు అన్నివిధాలైన డిపాజిట్ ఖాతాలు తెరుస్తామని, గోల్డ్‌లోన్, హౌసింగ్‌లోన్, వ్యవసాయ, ఇతర రుణ సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వెంకంపేట గ్రామ సర్పంచ్ ఇతర సిబ్బంది, కస్టమర్స్ పాల్గొన్నారు.



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్